నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బసంత్‌కాలనీ ఫీడర్ పరిధిలోని బసంత్ కాలనీ, లింగంపల్లి, వ్యాస్ హాస్టల్, వెంకటరమణా థియేటర్, జెయిన్ మందదిర్, కాచిగూడ క్రాస్‌రోడ్స్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు.. – గోల్కొండ క్రాస్‌రోడ్స్ ఫీడర్ పరిధిలోని ఏక్ మినార్ మసీద్, కృష్ణకాలనీ, శివాలయం టెంపుల్, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు, రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

కాచిగూడ: బర్కత్‌పురలోని జీవశ్రీ ఆయుర్వేద హాస్పటల్‌లో ఈనెల 8, 9 తేదీల్లో (శని,ఆదివారం) ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంతో పాటు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సునిత గ్రేస్ తెలిపారు. ముఖ్యంగా పైల్స్, అనెల్, ఫిస్టులా, పిలోనిడల్, మహిళల పీసీఓడీ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ వైద్య శిబిరంలో పాల్గొని ఉచిత వైద్యం పొందవచ్చునని తెలిపారు.

హాకీ పోటీల్లో సత్తాచాటిన 'హైమావతి'విద్యార్థులు

అంబర్‌పేట: జిల్లా స్థాయిలో నిర్వహించిన హాకీ పోటీల్లో అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన హైమావతి పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. హైదరాబాద్ జిల్లా ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన ఆండర్ 14 హాకీ టోర్నమెంట్‌లో బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే బాలుర విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు హైదరాబాద్ జిల్లా డీఈవో రోహిణి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ పాల్గొన్నారు.

తైక్వాండోలో హర్షభద్రకు సిల్వర్ మెడల్



ముషీరాబాద్: తైక్వాండో 38వ జాతీయ క్రీడా పోటీల్లో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్గొన్న హర్షభద్ర అనే విద్యార్థిని సిల్వర్ మెడల్ సాధించింది. శుక్రవారం తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జితేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, కోశాధికారి సతీష్‌గౌడ్ ఆమెను సన్మానించారు. మొట్టమొదటి సారి మహిళా విభాగంలో సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సీనియర్ కోచ్ బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటు

ముషీరాబాద్: పీడీఎస్‌యూ తెలంగాణ నూతన అధ్యక్షుడిగా కాంపాటి పృథ్వీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అనిల్ ఎన్నికయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో రెండు రోజుల పాటు జరిగిన పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఉపాధ్యక్షుడిగా నర్సింహారావు(వరంగల్), బి.భాస్కర్(నారాయణపేట), నరేందర్(నిజామాబాద్), అఖిల్(సూర్యాపేట), రాకేష్(హైదరాబాద్), సహాయ కార్యదర్శులుగా సాయికుమార్(నారాయణపేట), గణేష్(నిజామాబాద్), వెంకటేష్(ఖమ్మం), సురేష్(కామారెడ్డి), సంధ్య(మక్తల్), కోశాధికారిగా మహేందర్(నిర్మల్)లతో పాటు మరో 23 మంది రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు, తీర్మానాలు చేసినట్లు తెలిపారు.

డయాబెటిస్‌లో భారత్‌కు ప్రపంచంలో రెండో స్థానం

కవాడిగూడ: డయాబెటిస్ వ్యాధి విషయంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉందని, డయాబెటిస్‌తో మానవ శరీరంలోని ప్రతి అవయవం ప్రభావితమవుతుందని పలువురు వైద్య నిపుణులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మైక్రో ల్యాబ్స్ లిమిటెడ్ బెంగుళూరు ఆధ్వర్యంలో హోటల్ మారియట్ లో డయాబెటిస్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ కార్డియాలజిస్ట్ హైగ్రీవ రావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి రవిశంకర్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ జి సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డయాబెటిస్ కార్డియాలజీ కేసెస్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో డయాబెటిస్ వ్యాధిలో చైనా మొదటి స్థానంలో ఉండగా భారత రెండవ స్థానంలో ఉందని పేర్కొన్నారు. డయాబెటిస్ వల్ల శరీరంలోని గుండె కిడ్నీలు లివర్ తదితర అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. డయాబెటిస్ మానవ శరీరంపై ఎలాంటి ప్రభావాలు చెబుతుందని అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మైక్రో ల్యాబ్స్ లిమిటెడ్ సేల్స్ మేనేజర్ మురళి కృష్ణరాజుతో పాటు పలువురు డాక్టర్లు పాల్గొన్నారు



బాగ్‌లింగంపల్లిలో మూతపడ్డ హౌసింగ్‌బోర్డు దుకాణాలు

మూతపడి 14 ఏళ్లు

- శిథిలమైపోతున్న హౌసింగ్ బోర్డు దుకాణాలు
- ఎప్పుడు తెరుస్తారో తెలియని పరిస్థితి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సంబంధించిన 49 దుకాణాలు గత 14ఏళ్లుగా మూతపడి నిర్వహణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ దుకాణాలను ఎవరికి కేటాయించకుండా పెండింగ్‌లో పెట్టడంతో కొన్ని దుకాణాలు ఆక్రమణకు గురయ్యాయి. హౌసింగ్ బోర్డు దుకాణాలతో నిత్యం కళకళలాడే బాగ్‌లింగంపల్లి ప్రధాన రహదారి నేడు శిథిల భవనాలతో బోసిపోయినట్లుగా కళావిహీనంగా మారింది.

- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెగ్యూలర్ చేసే సమయంలో ఆయన మరణానంతరం 2011న ఆకస్మికంగా మూతపడ్డాయి. వైఎస్ఆర్ రెగ్యూలర్ చేయాలని చెప్పినప్పటికీ ఆయన లేకపోవడంతో మంత్రులు, అధికారులు మారడంతో ఈ దుస్థితికి దారి తీసింది. అయితే పెండింగ్ పడిన రెంటల్ ఎనాన్స్‌మెంట్ చెల్లించమని హౌసింగ్‌బోర్డు అధికారులు నోటీసులు జారీ చేయడంతో కొంత మంది దుకాణదారులు అవగాహన లోపంతో కోర్టులో కేసు వేయడం వల్ల సమస్య జఠిలమయ్యింది.
- ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డితో పాటు నాటి మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను పలుమార్లు కలిసినప్పటికి ప్రయోజనం లేకుండా పోయింది. అప్పటి గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం షాపులు మార్కెట్ రేటుతో ఆయా నిర్వాహకులకు ఇవ్వాలని హౌసింగ్ బోర్డు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రతి దుకాణానికి నోటీసు ఇచ్చే దశలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక 2023లో హౌసింగ్ బోర్డును ఆర్ఎన్‌బీలో విలీనం చేశారు. నాటి నుంచి నేటి వరకు షాపుల నిర్వాహకులు ఎంపీలు, ఎమ్మెల్యేల చుట్టూ చక్కర్లు కొడుతూనే ఉన్నారు.
- ప్రతి నెల హౌసింగ్‌బోర్డుకు అద్దెకింద సుమారు రూ.40వేలకు పైగా ఆదాయం వచ్చేది. అయితే దుకాణాలు మూసివేయడంతో ఇటు ఆదాయం రాక, అటు రిపేర్లు చేయించలేక ఆక్రమణ నుంచి కాపాడుకోలేని దుస్థితిలో హౌసింగ్‌బోర్డు ఉంది. నేటి ప్రజా ప్రభుత్వమైన స్పందించి మార్కెట్ ధరతో దుకాణదారులకు కేటాయించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

దుకాణాలు తెరిపించాలి



నేటి ప్రజా ప్రభుత్వం స్పందించి వెంటనే హౌసింగ్ బోర్డు దుకాణాలను తెరిపించాలి. సుందరయ్యపార్కు నుంచి వాటర్ వర్క్స్ ఆఫీసు వరకు సుమారు 49 షాపులు ఉన్నాయి. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాకు రెగ్యూలర్ చేయమని ఆదేశాలు ఇచ్చారు. ఆయన లేకపోవడంతో ఇటి మంత్రులు, అటు అధికారులు మారడంతో మాకు ఈ దుస్థితి ఏర్పడింది. 14ఏళ్లుగా షాపులు మూతపడడంతో ఆర్థికంగా చితికిపోయాం.

– జనార్దన్, షాపు నిర్వాహకులు

కిరాయిదారులకే కేటాయించాలి



వెంటనే హౌసింగ్ బోర్డు దుకాణాలు తెరిపించి ఆ దుకాణాలను కిరాయిదారులకే కేటాయించాలి. ఇట్టి విషయంపై మేము అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తూనే ఉన్నాం. మా వంతుగా ప్రయత్నాలు చేశాం. దుకాణాలు అన్నీ మూతపడటంతో బాగ్‌లింగంపల్లి ప్రధాన రహదారి బోసిపోయినట్లుగా అయింది. మార్కెట్ ధరతో నిర్వాహకులకే కేటాయించాలి.

– దశరథ్, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు

గ్రామ పంచాయతీలను గ్రేడ్‌ల వారీగా విభజించాలి



గ్రామ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం డైరీ ఆవిష్కరణలో టీఎస్‌జీవో అధ్యక్షుడు జగదీశ్వర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రామ పంచాయతీలను గ్రేడ్‌ల వారీగా విభజించాలని టీఎస్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం డైరీ, కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మారం జగదీశ్వర్, ముజీబ్‌లు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎంతో కాలంగా పదోన్నతులకు నోచుకోకుండా ఒకే గ్రేడ్‌లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు వెంటనే వివిధ గ్రేడ్‌లలో ఉన్న ఖాళీల్లో పదోన్నతులు కల్పించి భర్తీ చేయాలన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 కన్న ముందు ఉన్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994 మాదిరిగా గ్రామ పంచాయతీలను వివిధ అంశాల ఆధారంగా చేసుకోని 12769 గ్రామ పంచాయతీలను జనాభా ప్రతిపదికన పునరుద్ధరించి కేడర్ నిర్ధారణ చేయాలని కోరారు.

- పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు సందిల బలరామ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 317 వల్ల స్థానికత కోల్పోయి సుదూర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులను వెంటనే వారి సొంత జిల్లాలకు తీసుకురావాలని కోరారు. 2018 నియామకాల ద్వారా వచ్చిన ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ ఫోర్త్ పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యూలర్ చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టం 2005 నందు నిర్దేశించిన విధంగా గ్రామ పంచాయతీకి ఒక క్షేత్ర సహాయకుడిని నియమించి పంచాయతీ కార్యదర్శిపై ఉన్న పనిభారాన్ని తగ్గించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులకు అత్యవసర పరిస్థితి తప్ప నిర్దిష్టమైన పని వేళలు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, అసోసియేట్ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్, రంజిత్, సదానందం, ఎండి రఫీక్, కోశాధికారి నిరంజన్, ఉపాధ్యక్షులు కల్పన, రమాదేవి, రిషికాంత్‌గౌడ్, నల్లా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టు

ఐబీఎం అసోసియేట్ డైరెక్టర్ కులకర్ణి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కులకర్ణి, కళాశాల ప్రిన్సిపల్ డా.మోహన్‌కుమార్

కాచిగూడ: ఏ రంగంలోనైనా విజయాన్ని అందిపుచ్చుకోవాలంటే ఆత్మ విశ్వాసమే తొలిమెట్టు అని ఐబీఎం అసోసియేట్ డైరెక్టర్ కులకర్ణి అన్నారు. శుక్రవారం కాచిగూడలోని బద్రుకా వాణిజ్య కళాశాలలో జరిగిన అంతర్ కళాశాలల 'బిజ్‌కామ్–2025 మేనేజ్‌మెంట్ ఫెస్ట్'ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాజిటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ స్కిల్స్‌ను మెరుగుపరచుకుంటూ ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే విజయాలు వరిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ట్యాగ్‌లైన్ టేల్స్, బిజ్‌విజ్, స్టార్టప్ స్పార్క్, మాస్టర్స్ డొమైన్,యాడ్ వైబ్ రీక్రియేట్, డిజైన్ యువర్ మార్క్, జాంపాక్ట్ తదితర అంశాల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. నగరంలోని 32 కళాశాలల నుంచి 12 వందల మంది విద్యార్థులు, బద్రుకా విద్యాసంస్థలకు చెందిన 3వేల మంది విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. పలు అంశాల్లో జరిగిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ ఎం.జానకీరామ్, ప్రోగ్రాం కన్వీనర్ అనుపమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెండి అలంకరణ పనులకు టెండర్లు

వివరాలు వెల్లడించిన దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు



చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో వెండి తొడుగుల తయారీ కోసం ప్రకటించిన టెండర్‌లో సికింద్రాబాద్ జనరల్ బజార్‌కు చెందిన రామకృష్ణ జువెలర్స్ నిర్వాహకుడు సత్యనారాయణ అందరికంటే తక్కువకు టెండర్‌ను దక్కించుకున్నారు. ఆన్‌లైన్‌లో నలుగురు దరఖాస్తు చేసుకోగా శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటలకు ఆన్‌లైన్ టెండర్ సీల్ ఓపెన్ చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ స్థపతి వల్లీ నాయగం, హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ తమ్మినేని శేఖర్, ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో సీల్డ్ కవర్లను తెరిచారు. ఈ సందర్భంగా ఆలయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆంజనేయస్వామి దేవాలయం గర్భగుడిలో వెండి మకర తోరణంలో కూడిన మండపం, ద్వారా భాండములు, తలుపులకు వెండి రేకు నగిషీ తొడుగు అమరుస్తారని పేర్కొన్నారు. అదే విధంగా భవానీ శంకర్ స్వామి, భువనేశ్వరి అమ్మవార్లకు గర్భాలయ ద్వారా భాండములు, తలపులకు వెండి రేకు నగిషీ, తొడుగు పనులు చేపడుతున్నట్లు వారు చెప్పారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు జి.పద్మావతి, నిర్మల, శ్యాంకుమార్ ముదిరాజ్, సీతారాణి, సుబ్బారావు, బాలకుమార్, శివకుమార్, మురికి గణేష్, బీజేపీ నాయకులు రత్న సాయిచంద్, భక్తులు పాల్గొన్నారు.

ఎల్ఈడీతో ఆలయ ముఖద్వారం



ముషీరాబాద్: బాకారంలో ప్రసిద్ధిగాంచిన పోచమ్మ దేవాలయానికి ముఖద్వారాన్ని సుమారు రూ.50వేలు వెచ్చించి కర్నే నర్సింగ్ రావు దాత ఎల్ఈడీ లైటింగ్‌తో నేమ్ బోర్డును ఏర్పాటు చేసి పోచమ్మ దేవాలయం పట్ల తన భక్తిని చాటుకున్నారు.

గొప్ప మానవతా మూర్తి రమాబాయి

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



రమాబాయి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

కవాడిగూడ: గొప్ప మానవతా మూర్తి రమాబాయి అంబేడ్కర్ అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రమాబాయి అంబేడ్కర్ జయంతి వేడుకలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితంలో ఎదుర్కొన్న కష్టసుఖాల్లో తోడుండి ఆయన ఆశయ సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మానవతా మూర్తి అని కొనియాడారు. అనంతరం హైదరాబాద్ నగర తొలి అంబేడ్కర్‌రిస్ట్ బ్రాహ్మణపల్లి భారతి రామస్వామి దంపతులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రమాబాయి అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గుడిమల్లె వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జైభీమ్ యాదగిరితో పాటు అంబేడ్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సంజీవయ్యనగర్‌లో నివాళులర్పిస్తున్న గోపి రజక



అంబేడ్కరిస్ట్ బ్రాహ్మణపల్లి భారతిరామస్వామి దంపతులకు అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

చిక్కడపల్లి: బాల, బంధింత కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కార్మికశాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కార్యాలయంలో బంధిత కార్మిక నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల కార్మికులను పనుల్లో పెట్టుకోవడం నేరమని, అలాంటి వారిని తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం బాల కార్మిక నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బాల కార్మిక నిర్మూలనకు అధికారులంతా కలసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యామ్ సుందర్‌రెడ్డి, జి. సునీత, రాజేంద్రప్రసాద్, జాసన్, శ్రీనివాస్‌గౌడ్, శ్యాంసుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం



లలితా సహస్రనామ, కాలభైరవాష్టకం పారాయణల్లో పాల్గొన్న భక్తులు

నల్లకుంట: శ్రీశృంగేరి పీఠాధిపతి భారతితీర్థ మహా సన్నిధానం, విధుశేఖర భారతీ సన్నిధానం దివ్య అనుగ్రహ ఆశీస్సులతో శుక్రవారం కాశీ పుణ్యక్షేత్రంలో అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్ఠ, స్వర్ణకలశ కుంభాభిషేకం జరిగింది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం నల్లకుంట శంకరమఠంలో శారదామాత, చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠం ప్రాంగణంలో లలితా సహస్రనామం, సౌందర్య లహరి, శ్రీవిశ్వనాథాష్టకం, శ్రీ కాలభైరవాష్టకం పారాయణలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు



పూజలు కావించి భక్తులకు హారతి ఇస్తున్న అర్చకస్వామి



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

నల్లకుంట: ప్రశాంత్‌నగర్‌లోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఈనెల 2న ప్రారంభమైన నామస్మరణ వారోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం అర్చకస్వామి రామ్‌గోపాల్ రాధాకృష్ణులు, కుసుమహరులకు పూజలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే భక్తులచే సుప్రభాత సంకీర్తనలు, జయ హరనాథ జయ కుసుమకుమారి జయ షోడశ నామ సంకీర్తన జరిగింది. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాద వితరణ కావించారు. శనివారంతో నామస్మరణ వారోత్సవాలు ముగుస్తాయని అర్చకస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఉ.5గంటల నుంచి మరుసటి రోజు(ఆదివారం) ఉదయం 5గంటల వరకు 24గంటల పాటు అఖండ నామం ఉంటుందన్నారు.

కులగణన పారదర్శకంగా జరుగలేదు

- ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి

నల్లకుంట: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో ఎస్సీల కుల గణన సక్రమంగా నిర్వహించాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి(ఎస్సీఆర్‌పీఎస్) చేసిన విజ్ఞప్తిని పట్టించుకోలేదని ఆ సమితి హైదరాబాద్ అధ్యక్షుడు మందా సుధాకర్ నేడొక ప్రకటనలో ఆరోపించారు. ఎస్సీఆర్‌పీఎస్ చేసిన విజ్ఞప్తిని పట్టించుకోక పోగా కులగణనలో ఎస్సీ జనాభాను తప్పుగా చూపించారని తామంతా భావిస్తున్నామని అన్నారు. కుల గణనలో ఎస్సీ జాబితాలో మతం మారిన ఎస్సీ క్రిస్టియన్లను చూపించకపోవమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కులగణనలో క్రైస్తవుల జనాభా చూపించకపోవం దళిత క్రైస్తవులను మోసం చేయడమేనని అన్నారు. కుల గణన పారదర్శకంగా లేనందుకు తిరిగి కుల గణన చేపట్టాని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ హక్కులను మతం మారిన బీసీలకు కట్టబెట్టే కుట్రలో భాగమే ఈ కులగణన అని ఆయన ధ్వజమెత్తారు. ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు పోరాటాలకు తామంతా సిద్ధమన్నారు. ఆ తర్వాత జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ట్రంప్ నిర్ణయాలు విద్యార్థులకు, ఉద్యోగులకు గొడ్డలిపెట్టు

- సీపీఐఎంఎల్ న్యూ డెమాక్రసీ కేంద్ర కార్యదర్శి చంద్రన్న

ముషీరాబాద్: ఇటీవల అమెరికా అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు వర్ధమాన దేశాల విద్యార్థులు, ఉద్యోగులకు గొడ్డలిపెట్టులాంటివని సీపీఐఎంఎల్ న్యూ డెమాక్రసీ కేంద్ర కార్యదర్శి చంద్రన్న పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ప్రపంచంలోని వందలాది దేశాల నుంచి విద్యార్థులు సొంత పూచికత్తుపై అప్పులు చేసుకొని చదువుకునేందుకు వీసాలపై అమెరికాకు రావడాన్ని ట్రంప్ సర్కార్ అడ్డుకుంటోందని అన్నారు. సంవత్సరాల తరబడి అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు, ఆర్థిక పరిస్థితి సరిగా లేని విద్యార్థులు షాపుల్లో పార్ట్‌టైమ్ జాబ్ చేయడాన్ని కూడా ట్రంప్ సర్కార్ అడ్డుకోవడం బాధాకరమని అన్నారు. భారతదేశం నుంచి అమెరికా వెళ్లిన వేలాది మంది విద్యార్థులను పార్ట్‌టైమ్ ఉద్యోగులను ప్రత్యేకమైన విమానంలో ఖైదీలను పంపించినట్లుగా ఇండియాకు పంపించడాన్ని ఆయన ఖండించారు.

కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణోత్సవంలో కార్పొరేటర్ ఉమారాణి దంపతులు

కాచిగూడ: బర్కత్‌పుర బస్‌డిపో లేన్‌లో వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం కనులపండువగా జరిగింది. కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్ దంపతులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, విష్ణు మోహన్, సద్గుణ, అనురాధ, బాలప్రసాద్, ఆర్.సంతోష్, రామకృష్ణ, సూరి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. పరిష్కరిస్తామన్నారు..!

'మ్యాన్‌హోల్.. యమ డేంజర్'అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి వాటర్‌వార్క్స్ సీవరేజీ బోర్డు అధికారులు స్పందించారు. ఈ మేరకు మేనేజర్ కృష్ణమోహన్, సిబ్బంది జగన్ మ్యాన్‌హోళ్లను పరిశీలించి ప్రమాదం జరగకుండా బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. శనివారం నుంచి పనులు చేపట్టి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.– చిక్కడపల్లి



ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న అధికారి కృష్ణమోహన్, సిబ్బంది



ప్రమాదం జరగకుండా బారికేడ్‌లను ఏర్పాటు చేసిన దృశ్యం



సాక్షి

మ్యాన్‌హోల్..
యమ డేంజర్!

చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్

07/02/2025, Edition: Hyderabad(Musheerabad) Page: 11
Source : https://epaperapp.sakshi.com/

సాక్షిలో వచ్చిన కథనం